# సంపాదకీయము

మన జీవితకాలంలో 4 ఏళ్ళు పెద్దదిగా అనిపించకపోవచ్చు. కాని జీవితం శాశ్వతం కాదనీ మరియు ఆధ్యాత్మిక సాధనలో కాలయాపన తగదని ఎరిగినపుడు అది అత్యంత విలువైనదని గ్రహిస్తాము. ఈ దీపావళి నాటికి మన "సత్యపథము' 4 ఏళ్ళు పూర్తిచేసుకొని 5వ ఏడు ప్రవేశం చేస్తున్నది. నరకాసురుడు భూమాత తనయుడు. మానవుడిగా జన్మించి దైవత్వం పొందదగ అర్హతలన్నీ గలిగియున్నా ఐచ్ఛికంగా అసురు డయ్యాడు. అహింస, అసత్యము, అపరిగ్రహము, వ్యభిచారము మరియు ఉన్మత్తము విడనాడిననాడే జీవి మానవుడవుతాడు. మానవుడు ఇంద్రియ నిగ్రహము కలిగి, దుష్టచింతన విడనాడిననాడు, బ్రహ్మగతి పొందుతాడు. మానవ జీవితమునకు గమ్యము కనీసము బ్రహ్మగతియని మన పూజ్య బాబూజీగారు తన పుస్తకము 'సత్యోదయము'లో చెప్పియున్నారు. అట్టి అవకాశము గలిగి యున్నా తను అధోగతిపాలయిన దురదృష్టజీవి నరకాసురుడు. స్వాభిమానము, అతిశయము, ప్రజ్ఞ కలవారికి కలగడము ఆధ్యాత్మిక జీవితములో ఒక విశేషమైన పరీక్ష. ప్రజ్ఞ కలవారు సర్వ సాధారణముగా అణకువ కలిగియుండరు. అణకువ లేనిదే కైవల్యమబ్బదు. మన పూజ్య బాబూజీ గారు దీనినే "yeilding' అనే భావాన్ని గురించి ప్రస్తావించినప్పుడల్లా వివరిస్తుండేవారు. అణకువ అలవరచుకొనడం చాలా అవసరము. ఇది తప్పు, ఇది ఒప్పు అనే నిర్ణయం భగవంతుడు తన ప్రేరేపణవలన మహాత్ముల ద్వారా తెలియపరచినప్పటికీ, భగవంతుని సమక్షంలో ధర్మాధర్మ నిర్ణయం సరికాదు. 'సర్వధర్మాన్ పరిత్యజ మామేకం శరణం వ్రజ...' అన్నదానికి ఆధ్యాత్మిక తాత్పర్యం యిదే. దైవాంశ గలిగియున్నా జయ, విజయుల ఓటమికీ, నరకాసుర ఓటమికీ యిదే కారణం. భగవంతుని జోక్యము లేనిదే వారిని నిర్జించటము వీలుకాదు. స్వయంగా భగవంతుడు వచ్చి ధర్మము ఇదియని చెప్పినా వీలుపడనీయని అణకువలేని తనము వీరిది. అంతమాత్రాన ప్రజ్ఞ యుండరాదనేది వక్రభాష్యము. ప్రజ్ఞకూడా భగవత్కృపయే. ప్రజ్ఞ పరోపకారార్థముగా యుండవలె. మానవ సహజీవనమునకు తోడ్పడవలె. పరాన్నభుక్కులు, స్వార్థపరులు, పరపీడా క్రీడాభిలాషులు, వెనుకటి కాలంలోకూడా వున్నారనడానికి నరకాసురాదులు నిదర్శనము. అట్టివారు యిప్పుడు యింకా ఎక్కువైనారు. అసుర సంపత్తి అన్నిచోట్లా ఆరని చిచ్చులా వుంటూ యున్నది. శ్రీ కృష్ణావతారం వరకూ కూడా అవతరణ ముఖ్యోద్దేశము ఏదో కొంతమంది అసుర సంహారణయే. అట్టి చికిత్సకు సమస్త మానవాళికీ యివ్వడం వీలుపడని పరిస్థితి మానవుడు కల్పించినాడు. మానవ నైజంలోనే మార్పు

రావలసియున్న యిట్టి సమయంలో, సృష్టికర్త పంపగా వచ్చిన విశిష్ట మూర్తిమత్వము మన పూజ్య బాబూజీ గారు. వీరు సమస్త గురు పరంపరా సంపత్తియును కల్గి, భగవత్కార్యమగు మానవ నైజములో మౌలిక మార్పును తెచ్చి మానవ మనస్సును నిస్వార్థముగాను, భగవదంకితముగాను చేయుచున్న ప్రయత్నములో, మనందరికీ పాల్గొను అవకాశము కల్పించియున్నారు. అట్లు పాల్గొనడము విజ్ఞత. అది అందరికీ యుందనీ, యింకా కలగాలనీ ప్రార్థించడము మన కనీస ధర్మము.

అసతోమా సద్గమయ,
తమసోమా జ్యోతిర్గమయ,
మృత్యోర్మా అమృతం గమయ,
సర్వే జనాః సుఖినో భవంతు.
ఓం శాంతిః, శాంతిః, శాంతిః.

(సత్యపథము : దీపావళి సంచిక 1997: 5-1)